క్లుప్తంగా

అందరూ మొక్కలు నాటాలి



నల్లజర్లలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో విద్యార్థులతో కలసి మొక్క నాటుతున్న కల్నల్ అమిత్ పాండే

నల్లజర్ల: పర్యావరణ పరిరక్షణకు అందరూ విధిగా మొక్కలు నాటాలని 19వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్ అమిత్ పాండే పిలుపునిచ్చారు. నల్లజర్ల ఏకేఆర్జీ హైస్కూల్ మైదానంలో ఐదు రోజులుగా మూడు జిల్లాల ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆ స్కూల్ పరిసరాల్లో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. నీడనిచ్చే మొక్కలతో పాటు ఫలవృక్షాలు ఇందులో ఉన్నాయి. కార్యక్రమంలో ఏకేఆర్జీ విద్యాసంస్థల చైర్మన్ చావాగోఖుల్, కరస్పాండెంట్ వడ్లమూడి రామారావు, ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు, ఎన్‌సీసీ శిబిరం సూపరింటెండెంట్ కొండయ్య, శిబిరం ఇన్‌చార్జ్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ ఇన్‌చార్జ్ పులివెందర్ సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు



వృద్ధుడు సత్యనారాయణను సాయం పట్టి తీసుకొస్తున్న పట్టణ సీఐ విశ్వం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నదిలోకి దిగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడిని పోలీసులు శనివారం రక్షించారు. ధవళేశ్వరం సమీపంలోని రాజవోలు గ్రామానికి చెందిన నిమ్మలపూడి సత్యనారాయణ (78) అనే వృద్ధుడు ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతో కొవ్వూరు గోష్పాద క్షేత్రానికి వచ్చాడు. అతడు స్నానఘట్టంలోకి దిగి నది లోపలికి వెళ్లిపోతుండగా స్థానికులు ఆయనను రక్షించి పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ పి.విశ్వం తన సిబ్బందితో గోష్పాద క్షేత్రానికి చేరుకుని ఆ వృద్ధుడ్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయనను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ వృద్ధుడు రాజవోలు మాజీ సర్పంచ్. అనారోగ్యం, వయస్సు పైబడిన కారణంగా ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించినట్టు సీఐ తెలిపారు.

తీపర్రు ర్యాంపులో ఇసుక తవ్వకాలకు అంతరాయం



నీటమునిగిన ఇసుక ర్యాంపు

పెరవలి: మండలంలోని తీపర్రు ఇసుక ర్యాంపు నీట మునిగింది. దాంతో శనివారం నుంచి ఈ ర్యాంపులో ఇసుక తవ్వకాలు, ఎగుమతులు నిలిచి పోయాయి. అక్రమాలు జరిగాయనే ఆరోపణలు రావడంతో మండలంలోని కానూరు-పెండ్యాల, పందల పర్రు, జీడిగుంట ఇసుక రీచ్‌లను ఈ నెల 14న కలెక్టర్ ప్రశాంతి మూసివేసిన విషయం తెలిసిందే. దాంతో నిడదవోలు నియోజకవర్గంలోని నాలుగు ఇసుక ర్యాంపులు మూతపడినట్టు అయ్యింది. గోదావరి నదిలో మిగులు జలాలు పెరగడంతో నీటిని దిగువకు వదిలినట్టు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఫలితంగా తీపర్రు ఇసుక ర్యాంపు నీట మునిగింది. ఆ నీరంతా తగ్గడానికి కనీసం నాలుగు రోజుల సమయం పడుతుంది. అప్పటి వరకూ తీపర్రు ర్యాంపులో ఇసుక తవ్వకాలు నిలిచిపోతాయని అధికారులు చెబుతున్నారు.

హనుమ విగ్రహ ప్రతిష్ఠాపన

గోపాలపురం: స్థానిక గుడ్డిగూడెంలోని యర్రంపల్లమ్మ ఆలయం వద్ద శనివారం హనుమంతుని విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయునికి లక్ష తమలపాకులతో పూజ, సింధూర అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం వద్ద హనుమాన్ విగ్రహానికి ఏర్పాట్లు చేసిన దాతలు మద్దిపోటి గంగారావు, బుల్లెమ్మ దంపతులు, తొండాపు సత్తిరెడ్డి, జామి సూర్యచంద్రం, మరీదు ప్రసాద్, మచ్చా రాంబాబు దంపతులు అమ్మవారి ఆలయం వద్ద వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ వేడుకలో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



గోపాలపురం యర్రం పల్లమ్మ తల్లి గుడి వద్ద హనుమ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

రోడ్డుపై స్తంభాలు .. ప్రతిబంధకాలు

- వాహనాల రాకపోకలకు అంతరాయం
- తరచూ ప్రమాదాలు
- ప్రజాప్రతినిధులు చెప్పినా తొలగించని విద్యుత్ శాఖ
- రక్షణ ఏర్పాట్లు లేని ట్రాన్స్‌ఫార్మర్లు



ఖండవల్లి గ్రామంలో జనావాసాల మధ్య రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్

పెరవలి: తరచూ విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నా ఆ శాఖ అధికారులు మాత్రం పాఠాలు నేర్చుకోవడం లేదు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు, గృహాలను ఆనుకుని ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న కరెంటు వైర్ల వంటివి ప్రమాదాలకు కారణాలని తెలిసినా ఆ శాఖ అధికారులు వాటి రక్షణకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్‌కు కేవలం 10 మీటర్ల దూరంలో రెండేళ్ల క్రితం జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలోకి వచ్చాయి. నేటికీ వాటిని తొలగించకపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మూడేళ్ల క్రితం రూ.23 కోట్ల వ్యయంతో వడలి – ముక్కామల ఆర్ అండ్ బీ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను నేటికీ అక్కడి నుంచి తొలగించలేదు. ఈ స్తంభాల తొలగింపు కోసం రోడ్డు కాంట్రాక్టర్ రూ.25 లక్షల మొత్తాన్ని విద్యుత్ శాఖకు ఇప్పటికే చెల్లించారు. కొత్త స్తంభాలు వేసి పాత వాటిని అలాగే వదలేశారు. అన్నవరప్పాడు, ఖండవల్లి, ముక్కామల, పిట్టల వేమవరం, మల్లేశ్వరం గ్రామాల మీదుగా ఈ రోడ్డు సుమారు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉంది. రోడ్డు మధ్యలో స్తంభాలు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఖండవల్లి వద్ద విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ శాఖ అధికారులు హడావుడిగా అక్కడున్న ఆ ఒక్క విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. మిగిలిన స్తంభాలన్నింటినీ అలాగే వదలేశారు. అన్నవరప్పాడులో 60 మీటర్ల పరిధిలో కొత్తవి, పాతవి కలిపి 25 విద్యుత్ స్తంభాలు ఒకేచోట ఉండడంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బంది పడుతున్నారు. వాటిని అక్కడి నుంచి తొలగించాలని పలుమార్లు కోరినా పట్టించుకున్న వారే లేరు.



పెరవలి వద్ద హైవే సర్వీసు రోడ్డు మధ్యలో తొలగించని విద్యుత్తు స్తంభాలు



అన్నవరప్పాడు ఆర్ అండ్ బీ రోడ్డులో కొత్త, పాత విద్యుత్ స్తంభాలు

మంత్రి చెప్పినా బేఖాతరు

గతంలో అప్పటి నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు పలుమార్లు రోడ్డు మధ్యలోని స్తంభాలను తొలగించాలని తెల్పినా విద్యుత్ శాఖ అధికారులకు పట్టించుకోలేదు. స్థానికుల ద్వారా ఈ సమస్య గురించి తెలుసుకున్న ప్రస్తుత ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ కూడా విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఆ శాఖ అధికారులను ఇటీవల ఆదేశించారు. ఇంతవరకూ ఎలాంటి కదలిలా లేదు.

రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు

మండలంలోని 18 గ్రామాల్లో దాదాపు 275 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కదానికీ రక్షణ చర్యలు చేపట్టక పోవడంపై విద్యుత్ శాఖ అధికారులపై విమర్శలు వస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజు క్యారియర్లు కిందకు ఉండగా, వైర్లు వేలాడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రతి నెలా కరెంట్ బిల్లులు జారీ చేయడమే తప్ప రక్షణ చర్యలు చేపట్టరా? అని ప్రశ్నిస్తున్నారు.

లోడ్ వాహనం రావడం లేదు



విద్యుత్ స్తంభాలను తొలగించాలని చెప్పినా ఆ శాఖ వారు పట్టించుకోవడం లేదు. పెరవలిలో సర్వీసు రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండడంతో లారీలు రావడం లేదు. షాపులకు సరకుల లోడ్ వాహనం వచ్చినప్పుడల్లా నానా పాట్లూ పడుతున్నాం. రద్దీగా ఉండవలసిన రోడ్డు ఖాళీగా ఉంటోంది.

– బొకే వెంకటేశ్వర్లు, విద్యుత్ వినియోగదారుడు, పెరవలి

రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో భయం



వడలి-ముక్కామల రోడ్డులో విద్యుత్ స్తంభాలు ప్ర మాదకరంగా ఉన్నాయి. తొలగించాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. ఇటీవల రోడ్డు మధ్యలోని విద్యుత్ స్తంభాన్ని కారు ఢీ కొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ఎలాంటి రక్షణా లేని ట్రాన్స్‌ఫార్మర్లతో నిత్యం భయపడుతున్నాం.

–కుసుమే సూరిబాబు, ఖండవల్లి

హై -వే అథారిటీ సొమ్ము చెల్లించనందునే..

హైవే అథారిటీ అధికారులు ఇంతవరకూ సొమ్ము చెల్లించనందునే సర్వీసు రోడ్డులోని విద్యుత్ స్తంభాలను తొలగించలేదు. వారితో మాట్లాడి త్వరలోనే తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. వడలి-ముక్కామల రోడ్డులోని స్తంభాల తొలగింపునకు మాత్రం చర్యలు తీసుకుంటాం.

శ్రీధర్, విద్యుత్ శాఖ ఏడీఈ, నిడదవోలు

చికిత్స పొందుతున్న బాలికకు తలారి పరామర్శ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తాప్సీఆరోగ్య పరిస్థితిని ఆరా తీస్తున్న తలారి వెంకట్రావు

తాళ్లపూడి: ప్రమాదవశాత్తూ తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరంలోని డెల్టా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తాళ్లపూడి బాలిక పాటూరి తాప్సీని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం పరామర్శించారు. తాప్సీ ఆరోగ్య పరిస్థితి గురించి ఆయన ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పాప కుటుంబ సభ్యులకు ఆయన ధైర్యం చెప్పారు. అనంతరం బాలిక వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందించారు. అలాగే తాళ్లపూడి ఏఎస్‌వో జె. వెంకటేశ్వరరావు తన సోషల్ మీడియా ఫ్రెండ్స్ ద్వారా సేకరించిన రూ.13,500 మొత్తాన్ని తాప్సీ వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె తండ్రి నాగార్జునకు అందజేశారు. కాగా ఆ బాలిక ఇటీవల ఇంటి డాబా పై నుంచి కిందపడి గాయపడింది.

ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేయాలి

కొవ్వూరు: ఎస్సీ వర్గీకరణ క్రీమీలేయర్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్‌ను తక్షణమే రద్దు చేయాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాశ్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై కమిషన్‌ను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్– 338 ప్రకారం ఏర్పాటు చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ ఉన్నందున, దానిని కాదని వేరే కమిషన్‌ను నియమించడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రా కమిషన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా మాలలు అడ్డుకోవాలని శ్యాం రవి ప్రకాశ్ పిలుపునిచ్చారు. క్రీమీలేయర్ ముసుగులో షెడ్యూలు కులాల, తెగల రిజర్వేషన్ తొలగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు కులాల మధ్య కుంపటి పెట్టడం మానుకుని విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా చూడాలన్నారు.

నేడు కార్తీక వన సమారాధన

నిడదవోలు: పట్టణంలోని పంగిడి రోడ్డులోని పటిక ఫ్యాక్టరీ ఆవరణలో ఆదివారం శ్రీ కృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్టు ఆ సంఘాధ్యక్షుడు గాలి బంగారయ్య, కార్యదర్శి గుడ్ల వెంకట నారాయణ శనివారం తెలిపారు. ముఖ్య అతిథులుగా ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ హాజరు కానున్నారని తెలిపారు.

డిసెంబర్ 14న మెగా లోక్ అదాలత్

కొవ్వూరు: డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ సూచించారు. శనివారం కోర్టు హాల్లో ఇన్సూరెన్స్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు.లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ఖర్చులు ఆదా అవుతాయన్నారు.ఎక్కువ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించేందుకు న్యాయవాదులు తమ వంతు సహకరించాలని కోరారు.

నిడదవోలు: డిసెంబర్ 14న నిడదవోలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ సూచించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం ఆయన అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్‌పై చాగల్లు, సమిశ్రగూడెం పోలీస్ స్టేషన్ల ఏఎస్సైలు, నిడదవోలు, కొవ్వూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల ఎస్సైలకు అవగాహన కల్పించారు. మున్సిపాలిటీ, పౌర సరఫరాలు, రెవెన్యూ శాఖల కేసులను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని జడ్జి రామకృష్ణ సలహాఇచ్చారు.

19 నుంచి కొవ్వూరులో ఆధార్ నమోదు శిబిరాలు

కొవ్వూరు: ఆధార్ నమోదు, సవరణల కోసం పట్టణంలో ఈనెల 19 నుంచి 22 వరకూ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ శనివారం తెలిపారు.19న క్రిస్టియన్‌పేట సచివాలయం-2లోను, 20న ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు), ఏఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల్లోను, 21న మద్దిపట్ల వారి వీధి సచివాలయం -3లోను, 22న ఎన్‌జీవో హోమ్ సచివాలయం-7,8 లోను ఈ ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తామని వివరించారు. పట్టణ ప్రజలు వాటిని సద్వినియోగ పరచుకోవాలని ఆయన సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 3 పోలింగ్ స్టేషన్లు



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అచ్యుతకుమారి

పెరవలి: త్వరలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులూ ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలని తహసీల్దార్ డి.అచ్యుతకుమారి సూచించారు. ఈ ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు అన్ని పార్టీల నాయకులతో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో రెండు పోలింగ్ పోలింగ్ స్టేషన్లు ఉండేవన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి 750 ఓటర్లకు విధిగా ఒక పోలింగ్ స్టేషన్ చొప్పున ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అందుచేత పెరవలి మండలానికి మరో పోలింగ్ స్టేషన్ పెరిగిందన్నారు. పెరవలి ఉన్నత పాఠశాలలో ఒకటి, ప్రాథమిక పాఠశాలలో రెండు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు హక్కు కోసం మండలంలో 2,091 మంది గ్రాడ్యుయేట్లు దరఖాస్తులు ఇచ్చారని, వాటిని స్క్రూటినీ చేస్తామని తహసీల్దార్ వివరించారు. సమావేశంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మరో రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

- రాష్ట్ర గౌడ సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కృష్ణారావు
- తాడిపర్రు మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



తాడిపర్రులో మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న గౌడ సంఘ నాయకులు

ఉండ్రాజవరం: విద్యుత్ షాక్ వల్ల ప్రాణాలు కోల్పోయిన మండలంలోని తాడిపర్రు మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి మరో రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర గౌడ సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాతా కృష్ణారావు కోరారు. తాడిపర్రు గ్రామంలోని మృతులు బొల్లా వీర్రాజు, మారిశెట్టి మణికంఠ, పామర్తి నాగేంద్ర, కాసగాని కృష్ణ కుటుంబ సభ్యులకు తాడేపల్లిగూడెం గౌడ సంఘం తరపున శనివారం ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. ఒక్కో మృతుని కుటుంబానికి రూ.20 వేల చొప్పున, గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్న అనంతరావు మెరుగైన చికిత్స కోసం రూ.30 వేలు అందజేశారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా తాతా కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. మృతుల కుటుంబాలకు విద్యుత్ శాఖ తరపున రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించారని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల గౌడ సంఘాల నుంచి విరాళాలు సేకరించి మృతుల కుటుంబాలకు అందజేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు గౌడ్, తాడేపల్లిగూడెం గౌడ సంఘం అధ్యక్షుడు కోట రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఆత్తిలి బాబీ, జిల్లా కార్యదర్శి మట్టా రామకృష్ణ, మండల ప్రెసిడెంట్ చిటికెన శ్రీనివాసు, పశ్చిమ గోదావరి జిల్లా గౌడ సంఘం యూత్ ప్రెసిడెంట్ చిటికెన సూర్యప్రకాశ్, ఎంపీటీసీ సభ్యులు కట్టా వెంకటేశ్వరరావు, మారిశెట్టి సూరిబాబు, అబ్బు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలంగిలో ఫీవర్ సర్వే

ఉండ్రాజవరం: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఇంట్లోని కుటుంబ సభ్యులు ఆరోగ్యాలు బాగుంటాయనే విషయాన్ని ప్రజలు గమనించాలని పాలంగి హెల్త్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కాపా నాగరాజు అన్నారు. మండలంలో పాలంగి గ్రామంలో 10, 11 వార్డుల్లో శనివారం ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో గ్రామంలోని ఎవరికీ జ్వరం కేసులు నమోదు కాలేదన్నారు. 10వ వార్డులోని డ్రైన్‌లో పారని మురుగు ఎక్కువగా ఉందన్నారు. ఈ విషయాన్ని పాలంగి పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకు వెళ్లామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కె.బులి వెంకమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో రోజూ స్ఫటిక లింగ దర్శనం



అన్నవరప్పాడులో స్ఫటిక లింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు

సుమారు 10 వేల మందికి అన్న సమారాధన

పెరవలి: అన్నవరప్పాడు గ్రామంలోని ఉమా విశ్వేశ్వర స్వామివారి ఆలయం ప్రాంగణంలో ప్రతిష్ఠించిన స్ఫటిక లింగాన్ని రెండో రోజు శనివారం కూడా వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. కార్తిక మాసం కావడంతో ×హరహర మహాదేవా శంభో శంకరా× అనే శరణు ఘోషతో ఈ ప్రాంతం మార్మోగింది. స్ఫటిక లింగాన్ని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులతో జాతీయ రహదారిపై అర కిలోమీటరు పొడవునా క్యూలైన్ ఏర్పడింది. రాష్ట్ర మంత్రులు వాసంశెట్టి సుభాష్, నిమ్మల రామానాయుడు కూడా శనివారం స్ఫటిక లింగాన్ని దర్శించుకున్నారు. లింగ దర్శనం కోసం వచ్చిన భక్తులకు బొలిశెట్టి రామకృష్ణ అన్న సమారాధన చేశారు. స్వామి వారి ప్రసాదాన్ని సుమారు 10 వేల మంది స్వీకరించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పంతం మంగతాయారు, వివిధ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ: నలుగురికి గాయాలు

తాళ్లపూడి: ఏటిగట్టుపై తాళ్లపూడి – ప్రక్కిలంక గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో బైక్‌లపై వెళుతున్న నలుగురు యువకులు గాయపడ్డారు. వారిలో ఒకరికి బలమైన గాయాలయ్యాయి. వైద్యం కోసం క్షతగాత్రులను తాళ్లపూడిలోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. క్షతగాత్రులను కొత్త పట్టిసీమకు చెందిన వై.నాగేంద్ర, బొడ్డుపల్లి లక్ష్మీనారాయణ, ప్రక్కిలంకకు చెందిన సంఘటి దుర్గాప్రసాద్, బొడ్డుపల్లి వీరన్నలుగా గుర్తించారు. ఆస్పత్రి వర్గాల నుంచి తమకు ఎలాంటి సమాచారం రాలేదని తాళ్లపూడి పోలీసులు తెలిపారు.

గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులకు నివాళులు



ఉండ్రాజవరంలో గ్రంథాలయ ఉద్యమ సారథుల చిత్ర పటాలకు నివాళులు

చాగల్లు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చాగల్లు, చంద్రవరం శాఖా గ్రంథాలయాల్లో శనివారం గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులకు నివాళులు అర్పించారు. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, గ్రంథాలయాల పంచ సూత్రాల రూపశిల్పి ఎస్సార్ రంగనాథన్, గాంధేయవాది పాతూరి నాగభూషణం, వయోజన విద్యా పితామహుడు, పాత్రికేయుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావులకు నివాళులు అర్పించారు. గ్రంథ పాలకులు సుమన్ కుమార్, గద్దే శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: గ్రంథాలయ ఉద్యమానికి అవిరళ కృషి చేసిన డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి రమణయ్యల స్ఫూర్తితో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని విశ్రాంత అధ్యాపకుడు కోట రామ్‌ప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమ పితామహులను స్మరించుకుని, వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సీనియర్స్, జూనియర్స్ విభాగాలుగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆకెళ్ల సుబ్రహ్మణ్యం పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు గుత్తికొండ కృష్ణారావు, సభ్యులు ఆకెళ్ళ శ్రీనివాసు, వెంపటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నల్లజర్ల, దూబచర్ల తదితర గ్రామాల నుంచి దాదాపు 60 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. సంస్థ చైర్‌పర్సన్ జి.సుశీల, గ్రంథ పాలకురాలు ఏవీరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొవ్వూరు: పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు శనివారం దేశభక్తి, లలిత, జానపద గీతాల పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 110 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు ఆలపించిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. గ్రంథాలయాల అభివృద్ధికి కారుకులైన పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య, గ్రంథాలయ శాస్త్రంలో విశేష కృషి చేసిన డాక్టర్ రంగనాథన్, గ్రంథాలయ ఉద్యమకారుడు పాతూరి నాగభూషణం సేవలను ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) లైబ్రేరియన్ జె.ఉదయ శ్రీ వివరించారు.గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి జీవీవీఎస్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో పాట పాడుతున్న విద్యార్థి



చాగల్లులో గ్రంథాలయాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న వక్త

ముగిసిన వేంకటేశ్వరస్వామి తీర్థం



వేగేశ్వరపురం వేంకటేశ్వరస్వామి తీర్థంలో భక్తుల సందడి

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామంలో వెంకన్నబాబు తీర్థాన్ని రెండో రోజైన శనివారం కూడా నిర్వహించారు. ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఏటా కార్తిక పౌర్ణమి నాడు నిర్వహించే వెంకన్నబాబు తీర్థానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తారు. ఈ ఏడాది కూడా భారీగా తరలి వచ్చిన భక్తులు అలివేలు మంగా పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వారికి పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం ప్రాంగణంలో రంగుల రాట్నాలు, జెయింట్ వీల్, పలు దూకాణాలు ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది.